# 39. అప్పారావు (జూనియర్)

పాతికేళ్ల కిందటిమాట.

మా చిన్నాన్న గారమ్మాయి ఇందిర పెళ్లి జరిగింది, ఆ ఏడాది. ఆ పెళ్లి అంతా చిత్రం, విచిత్రం!

పెళ్లి చూపుల తతంగం నుంచి మొదలై అంపకాలు శోభనం వరకు దేనికదే ప్రత్యేక తరహాలో జరిగాయి. "ఒకొక్కప్పుడు నిజం అనేది కల్పన కన్నా ఆశ్చర్యకరంగా ఉంటుంది" అనే లాంటి రిమార్కులు పుట్టడానికి అలాటి సంఘటనలే కారణాలవుతాయి.

"ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో బెజవాడ చేరే (ఫలానా) రైల్లో వస్తున్నాను. ఆ సాయంకాలం ఆరున్నరకి బెజవాడలో బయలుదేరే (ఫలానా) రైల్లో నేనూ నా (బెజవాడ) స్నేహితురాలు రజనీ ఒకానొక ఇంటర్వ్యూ నిమిత్తం మద్రాసు వెళ్తున్నాం. (నాలుగు గంటలు ఆగుతాను.) నీవు వదినతో సహా రైలు స్టేషనుకి రావలయును" అని ఇందిర ఉత్తరం.

"నమస్కారం. మీ గురించి వినడమేగాని ఎన్నడూ మీ పరిచయ భాగ్యం కలగలేదు. అయితే; ఈ నెల 15వ తేదీని; నేను, మా శ్రీమతి బెజవాడ వస్తున్నాము. మా అబ్బాయి కూడా మీ అభిమానుల్లో ఒకడు. అతడు అదే రోజున సాయంకాలం సుమారు 4 గంటలప్పుడు బెజవాడలో ఒక అరగంట ఆగే మద్రాసు-ఢిల్లీ రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. రైల్వే రిటైరింగ్ రూంలలో 7వ నెంబరు గది బుక్ చేసుకున్నాము. తమరు శ్రమ తీసుకుని వచ్చినచో మిక్కిలి సంతోషించెదము -

ఇట్లు

కె. అప్పారావు; సైంటిస్టు, మచిలీపట్నం."

ఒంటిగంట అవుతూ ఉండగా ఇందిర తమ్ముడు రవణ గుంటూరు నుంచి వచ్చి "అన్నయ్యా; ఆఫీసుకి ఈ పూట సెలవు పెట్టేసి పద, మనం రైలు స్టేషనులో ఈ పూటంతా గడపాలి. ఇంటికెళ్లి ఒదినకి చెప్పేను. తను డైరెక్టుగా వెళ్లిపోతానంది." అన్నాడు. తోవలో చెప్పాడు. ఆ అప్పారావుగారబ్బాయికి మద్రాసులో ఉద్యోగం. అతను ఇందిరని ఏదో పెళ్లిలో చూసేడట. ఇప్పుడు ఇందిర అతని తల్లిదండ్రులని చూడడానికి పెళ్లిమాటలు సాగించడానికీ ఈ సమావేశమట.

అబ్బాయి రైలు దిగి రిటైరింగ్ రూం కొచ్చి పది నిమిషాలుండి తన ప్రయాణం కొనసాగించేడు. పిన్ని, నేను, ఇందిర, దాని ఫ్రెండు రజని; రవణ; అప్పారావు గారు, ఆయన భార్య ఉన్నాం.

"మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చింది. మాకు జాతకాలూ అవీ అక్కర్లేదు. ఏర్పాట్లు జరిపించి పెళ్లి చేయించండి." అన్నారు అప్పారావు గారు.

నేనూ మా పిన్నీ కొంచెంసేపు వరండాలో కెళ్దామని లేచాం. "అదికాదు గోపాలా! వాళ్లు

కట్నం ఎంత అడుగుతారో, లాంఛనాలేమిటో ఏమీ తెలీదు కదా. ఇప్పటికి ఈ సంగతి ఇలా వదిలేసి రెండు రోజులు ఆగి మంచిరోజు చూసుకుని నువ్వూ కోడలూ బందరు వెళ్లి అన్నీ వివరంగా మాట్లాడితే మంచిదేమో. మన తాహతుకి మించిన కోరికలైతే మనం తూగలేం కదా'' అంది పిన్ని.

"అక్కర్లేదండీ'' అన్నారు; మా వెనకే వరండాలోకి వచ్చిన అప్పారావు గారు. "మాకు కట్నాలూ లాంఛనాలూ ఏమీ వద్దు. అమ్మాయి ఇష్టపడిందేమో కనుక్కుని ప్రొసీడయిపోండి''

పిన్ని వెనక్కి తిరిగి రూంలోకెళ్లి ఇందిరకి సంజ్ఞ చేసింది. వాళ్లిద్దరూ వరండాలో అవతలివేపున చిన్న సబ్ కమిటీ మీటింగు పెట్టేరు. రెండు నిమిషాల్లో ఇందిర, రజని, రవణ మెట్లు దిగి ప్లాట్‌ఫారాల మీదికి వెళ్లిపోయారు.

అప్పారావు గారు చకచకా కాగితం కలం పుచ్చుకుని ఏర్పాట్లు, పెట్టుబడులు జాబితా వ్రాసేరు. మంగళసూత్రాలూ; మట్టెలు- ఒకే అన్నారు. వెండిచెంబు, వెండి కంచం అక్కర్లేదని అన్నారు. కాశీయాత్ర సందర్భంగా గొడుగు, చేతికర్ర, పాంకోళ్లు అతికష్టం మీద సరేనన్నారు.

"తోటలో దిగడం'' నుంచి "శోభనం'' వరకు వాళ్లకి పెట్టవలసినవి మొత్తం 15 చీరలు; 4 సూటుగుడ్డలు, 8 పంచెల చాపులు, రెండు దుప్పట్లు; వాళ్లు 14 చీరలు, 6 పంచెల చాపులు ఇలా లెక్క తేలాయి. 29 చీరల్లో పన్నాలుగు పట్టుచీరలని కూడా నిర్ధారణ అయింది.

"మీరు మేమూ కలిసి బట్టలషాపుల వాళ్లని బాగుచెయ్యడం అవుతుంది గాని ఈ భారీ బట్టల మార్పిడి వల్ల ప్రయోజనం ఏమీ లేదు. మీకు సరదా ఉన్నంత మేరకి మీరు బట్టలు కొనుక్కుని శుభకార్యంలో కట్టుకోండి. మాకు సరదా ఉన్నంతమేరకు మేం కూడా అలా చేస్తాం. ఎవరికీ ఎవరూ ఏమీ పెట్టనవసరం లేదు'' అన్నారు అప్పారావు గారు. "పెళ్లికి మేం బందరు నుంచి, ఏలూరు నుంచి, హైదరాబాదు నుంచి మా ఖర్చులు పెట్టుకుని వస్తాం. మీరు కూడా ఎక్కడెక్కడి వాళ్లు విజయవాడకి రండి. ఇక్కడే కలిసి ఇక్కడే విడిపోదాం'' అన్నారు.

రేపు ఉదయం పెళ్లి అనగా తొలిరోజు సాయంకాలం ముఖ్యమైన వాళ్లం అందరూ చేరాం. "రేపు ఖాళీ ఉండదు'' అని అప్పటికప్పుడు ఫొటో గ్రాఫర్‌ని పిలిపించి గ్రూప్ ఫొటోలు, అబ్బాయినీ, అమ్మాయినీ విడిగానూ కలిపీ ఫొటోలు తీయించారు అప్పారావు గారు. రిజిస్ట్రార్ గార్ని పెళ్లి మంటపానికి రప్పించి మంత్రం అయిపోయిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించేరు. వాళ్లు ఇద్దరూ ఉన్న ఫొటో అతికించి సర్టిఫికేటు తీసుకున్నారు. ఉదయం 11-20కి పెళ్లి. ఒంటి గంటకి భోజనాలు. సాయంకాలం రైలుకి ఇందిర, సత్యారావు తిరుపతికి, మేం ఎవరి ఇళ్లకి వాళ్లు, అదే శోభనం, అదే హనీమూన్!

పెళ్లికి ముందు ఇందిర మద్రాసు వెళ్లింది ఒక ఉద్యోగపు ఇంటర్వ్యూకి కదా. ఆ ఉద్యోగం ఇందిరకొచ్చింది. సత్యారావుకి అంతకు ముందే మద్రాసులో ఉద్యోగం ఉంది. ఇందిరకి పెళ్లయిన మూడేళ్లలో ఒక కొడుకూ, ఒక కూతురూ పుట్టేరు. ఇందిర పదేళ్లపాటు ఉద్యోగం చేసి ఆ తరువాత మానేసింది. కోడంబాక్కంలో ఒక చిన్నఇల్లు కొనుక్కున్నారు. పిల్లల్నిద్దర్నీ బాగా చదివించుకున్నారు. కొడుకు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వారు పెట్టిన పరీక్ష రాసి సీనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం సంపాదించుకున్నాడు. కూతురు బి.ఏ., బి.ఇడి; చేసి ఖాళీగా ఉంది.

ఇప్పుడు ఇందిర తమ్ముడు రవణకి తన కూతురి పెళ్లి సమస్య వచ్చి మార్చుంది.

రేవతి ఆర్కిటెక్చర్ (సివిల్ ఇంజనీరింగ్) లో డిప్లొమో తీసుకుంది. ఇరవై రెండు ఏళ్లు వెళ్లాయి. ఇందిర కొడుకు దానికి ఈడు అవుతాడు. "పిల్లలిద్దరూ ఒకరికొకరు బాగా తెలిసిన వాళ్లే కనక పెళ్లిచూపులూ తతంగం అవసరం ఉండదనుకుంటాను. నువ్వు ఒదిన్ని తీసుకుని ఒకసారి మద్రాసు వెళ్లి అక్కడికి నచ్చచెప్పి ఈ శుభకార్యం నీ చేతులమీదుగా జరిపించు అన్నయ్యా" అన్నాడు నా దగ్గిరకొచ్చి.

"వాడింకా ఏవో పరీక్షలు రాస్తానంటాడు. పెళ్లికి తగిన వయస్సయితే వచ్చింది గాని నాకిప్పుడప్పుడే పెళ్లి వద్దని వాడు అంటే మనం చేసేదేముంది?" అంది ఇందిర.

"నాదేం లేదు. మీరూ మీరూ ఒకటి కదా. అంతా ఇందిర ఇష్టం, అబ్బాయి ఇష్టం. వాళ్లు ఒకే అంటే ఆవేళకొచ్చి నాలుగక్షింతలు వెయ్యడం తప్ప నేను కలుగజేసుకునేదేం వుండదు" అన్నారు సత్యారావుగారు.

"ఈ సంసారం కోసం అమ్మ అష్టకష్టాలు పడి మమ్మల్ని ఇంత వాళ్లని చేసింది. అనకూడదుగాని మంచి వయసులో ఉన్నప్పుడు పదిమంది మధ్యకీ ఉద్యోగానికి కూడా పదేళ్లపాటు వెళ్లింది. మాకు ఈ ఇల్లు తప్ప ఇంకేం వుంది, ఒక స్కూటరా, కలర్ టీవీనా, ఒక వి.సి.ఆరా? ఇంకా లలిత పెళ్లి ఒకటుంది; మాకో పెద్ద బాధ్యతగా, లలిత కూడా అమ్మలాగా ఉద్యోగానికి వెళ్లవలసిన పరిస్థితి రాకుండా దానికి ఒక క్లీన్‌మేచ్ చూడాలంటే మేం ఈ ఇల్లు కూడా అమ్మేసుకోవాలేమో!" అన్నాడు అప్పారావు (జూనియర్)

"విన్నావా, వాడి మాటలు? రోజులు మారిపోయేయి. మీ బావగారు నన్ను రైల్వే ప్లాట్‌ఫారం మీద చూసేసి లైబ్రరీ హాల్లో పెళ్లి చేసుకొని దైవదర్శనమే హనీమూన్ అన్నారు. ఇచ్చిపుచ్చుకోడాలేమీ లేకుండా పెళ్లిళ్లయిపోడానకి మన రోజులు కావన్నయ్యా." అంది ఇందిర.

"ఇవ్వడానికి రవణ దగ్గిర ఏముంది ఇందిరా? పొగాకు కంపెనీలో ఈ పాతిక, ముప్పయ్యేళ్ల నించీ పని చేస్తున్నా వాడి జాతకం అంతా గాజుల బేరం భోజనానికి సరి అన్నట్టుగా ఉంది. ఏదో మేనత్తవి కదా, తల్లికి మించిన తల్లిగా పిల్లని కడుపులో పెట్టుకుంటావని దేవుళ్లాడుతున్నాడు, అంతే! అంతగా లలిత ఉద్యోగానికి వెళ్లకూడదని అనుకుంటే రేవతి చదువుకూడా అంత తీసిపారేసేది కాదు గనక ఉద్యోగానికి వెళ్లో కన్సల్టెన్సీ పెట్టుకునో మీకు వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా సాయపడుతుంది ఆలోచించు." అన్నాను.

"సర్లెండి. ఆవిడ ఈ మహాపట్నంలో ప్రవేశించి కన్సల్టెన్సీ పెట్టుకుని ప్లాన్లూ డిజైన్లూ తయారుచేసి ఎప్పటికి రాణకొచ్చేను! ఇదిగానీ మాకు తప్పదనుకుంటే మా కుటుంబం "త్యాగమూర్తులు" అనిపించుకుని ఏదో "తామ్రపత్రం" సాధించుకోవడం తప్ప వేరే ఇహం లేనట్టే కదా" అన్నాడు అప్పారావు (జూనియర్)

★★★

అప్పారావుగారూ; మీరు ఇంకో పాతికేళ్లయినా బ్రతికి ఉండకూడదా? ఏం పుట్టి మునిగిపోయిందని; అరవై ఐదేళ్లకే కాలధర్మం చెంది వెళ్లిపోయారు? మీ అంశ ఉన్న ఈ కుటుంబంలో మీ ఆశయాలూ ఆదర్శాలూ పాడుకోకుండా వెళ్లిపోవడం అన్యాయం సార్! ★